# అంతరంగాలు

రామశాస్త్రి చెప్పిన కథ:

కులాలు, ధర్మాలు, మతాలు అంటూ చాలా వాదించి కాపాడుకునే కులంలో 1926వ సంవత్సరంలో పుట్టాను నేను. అధిక మాసాలతో కలిపి లెక్కేస్తుంటే నా వయస్సు ఇంకా ఎక్కువే. రామశాస్త్రి గారంటే ఓహో.. అనే విధంగా మంచి పేరే వచ్చింది నాకు. భగవంతుడు ఇంకా నన్ను ఈ

భూమ్మీద ఎందుకుంచాడో తెలీదు. ఇంక చాలనిపిస్తోంది చాలాసార్లు.

నా కళ్లముందే ఆచారాలు, కులధర్మాలు అంతరించిపోతున్నాయి. జీర్ణించుకోవటం చాలా కష్టంగానే ఉంటోంది. కానీ బతకాలంటే అవి తప్పదు అనిపిస్తోంది.

నా కొడుకు మంచివాడే. సంధ్యావందనం మానేసినా పుట్టక సంస్కారాన్ని మర్చిపోలేదు. వాడో స్కూలు మాస్టరు. కేశవవర్మ మాస్టారంటే నిజాయితీపరుడనే పేరు సంపాయించుకున్నాడు. వాణ్ణి పొగిడితే ఆయుక్షీణమని నేను చాటుగుండా వాణ్ని మెచ్చుకుంటాను. వెర్రివెధవ... వాడికి యాభై అయిదు ఏళ్లు వచ్చాయి. నా ముందు నిలబడ్డానికే భయం వాడికి. చాలాసార్లనుకుంటాను– ఆ భయం పోగొడదామని. కానీ, అది వాడి 'వినయం' అని సర్దిచెప్పుకుంటాను. వాడితో నాకే గొడవా లేదు. వాడి పెళ్లాం... నా కోడలు సౌజన్య కూడా మంచి పిల్లే. కానీ పిల్లల్ని కంటారుగానీ, వాళ్ల జాతకాల్ని కనలేరు కదా. వాళ్లని చూస్తే పాపం నాకు జాలేస్తోంది. నాకున్నంత పుత్రోత్సాహం వాళ్లకి దక్కలేదు.

*కేశవవర్మ చెప్పిన కథ:*

నాన్నేమనుకుంటారోనని భయమేస్తూనే ఉంది. నాన్నకెలా చెప్పాలో అర్థం కావట్లేదు. మాధవ్ చాలా తప్పు చేశాడు. తప్పుడు పని అనలేను గానీ, మా నాన్న బతికుండగా వాడు కులాంతర వివాహం చేసుకోవడం. అదీ మతాంతరం. వాళ్ళెవళ్లో కులం తెలీదు కానీ మతం మారారు. ఆ అమ్మాయి పేరు జూలీ. వాళ్లమ్మ మహేశ్వరి, వాళ్ల నాన్న శామ్యూల్ రెడ్డి. కులం, మతం వాళ్లే మార్చుకున్నారు. మనం వాళ్లని మన కుటుంబంలోకి ఆహ్వానించడానికి తప్పేముంది అని నాకు నేను నచ్చచెప్పుకున్నాను. కానీ నాన్న ఈ వయస్సులో ఈ విషయాన్ని తట్టుకోగలడా అని భయంగానే

ఉంది.

మాధవ్‌తో ఒక మాటే అన్నాను. "ఒరేయ్.. తాతయ్యకి ఆ అమ్మాయి పేరు జలజ అని చెప్పరా. మీ అత్తగారి పేరు, మావగారి పేరు, వాళ్ల కులం, మతం ఆయనకి చెప్పకు. పెద్దాయన కదా. ఆ అమ్మాయిని బొట్టు పెట్టుకోమను. మా నాన్న ఉన్నంతకాలం ఆమె నాన్ వెజిటేరియన్ అని తెలియనియ్యద్దు" అన్నాను.

నా కళ్లల్లో నీళ్ళు పొంగాయ్. మాధవ బొట బొటా కన్నీళ్లు కార్చాడు. "సారీ నాన్నా" అంటూ. నేనే ఓదార్చవలసివచ్చింది. నువ్వు తప్పు చెయ్యలేదురా. తాతయ్యకి ఇది తప్పనిపించకూడదు. అందుకే అబద్ధాలాడదాం. ఆయన కొన్నాళ్లలో పోవచ్చు. మేమూ మధ్యలో వెళ్లిపోవచ్చు. నిండు నూరేళ్లు బతకాల్సింది మీరు. నాకోసం ఈ ఒక్క అబద్ధం ఆడండి.

మాధవ్ చెప్పిన కథ:

తరానికీ, తరానికీ మధ్య ఎదుగుతున్న మా కులమంటే నాకు చాలా గౌరవం కలుగుతోంది. మా తాతయ్యకి తెలియకూడదు. మా నాన్నకి తెలిసినా సహిస్తున్నాడు. నేను కులమతాల్ని అతిక్రమిస్తూ ముందుకు వెళ్లడానికి నాన్న ప్రోత్సహిస్తున్నాడు. నాన్న చెప్పినట్టే తాతయ్యతో ఆ పిల్ల మన వాళ్ల పిల్లే అని నమ్మించాను. కానీ నేను పుట్టిన కులం శాపమేమిటో కానీ, జూలీ అమ్మా నాన్నా మా పెళ్లిని ఒప్పుకోలేదు. చాలా గొడవలే చేశారు. జూలీ మా ఇంటికి రాగానే నిజంగా 'జలజ' అయిపోయింది. ఇది మతం మార్పిడి కాదు. కులం మార్పిడీ కాదు. మనసుల మార్పిడి. మా తాతయ్యకి నా భార్యంటే ఎంతిష్టమో. ఆయన కోసం ఎన్ని ఆచారాలు నేర్చుకుందో.. నేను చెప్పలేను.

*జలజ చెప్పిన కథ:*

ఒక రోజున నేను తాతయ్యగారి ప్రేమాభిమానాలు చూసి కన్నీళ్లమయమై "తాతయ్యగారూ.. అత్తయ్యకీ, మావయ్యకీ మా పెళ్లి అంత ఇష్టంలేదు. ఎందుకంటే మీరు బాధపడతారనీ మీ కులం, మా కులం ఒకటి కాదనీ"

"నాకు తెల్సమ్మా. కేశవ్ ఈ సంగతి నాతో చెప్పడానికి మొహమాట పడ్డాడు. వాడు పిచ్చోడమ్మా. ఎవరికిష్టమొచ్చినట్టు వాళ్ల బతుకు నడుపుకోవడం వాళ్ల హక్కు. నేనీ విషయంలో కేశవ్ కన్నా, నీ మొగుణ్ణే సమర్థిస్తాను. తనకి కావల్సిందేదో ధైర్యంగా చెప్పాడు మాధవ్. జరిగిందేదో ధైర్యంగా చెప్పలేకపోయాడు మీ మావగారు"

నేను కన్నీళ్లతో తాతగారి పాదాలు కడిగేశాను. ఎనభై ఏళ్ల పెద్దాయనలో ఉన్న ఔదార్యం మా తల్లిదండ్రుల్లో లేదన్న కన్నీరో, ఇంత మంచి కుటుంబంలోకి నేను వచ్చినందుకు ఆనందమో.. తాతయ్య నన్ను లేవదీసి నుదుట ముద్దు పెట్టుకున్నారు. ఆ ముద్దు నా పాలిట పాపట సిందూరం. ఆయన సౌజన్యానికి తార్కాణం. నా సౌభాగ్యానికి నూరేళ్ల ముద్ర.

*రైటర్ చెప్పిన కథ:*

కాలం మనుష్యులని మారుస్తుంది. మనసులని పెంచుతుంది. ఆత్మీయతానురాగాలు నిలబడుతూన్నంతసేపూ, ద్వేషావేశాలు లేనంతకాలం. శిశిరం తర్వాత వసంతాలు విరబూయాలి. తరంతరం మంచిమార్పుల్తో ఎదగాలి- ఇది ప్రకృతి నేర్పే రీతి-